## క్లుప్తంగా

### పారిశుద్ధ్య పనులు ప్రారంభం



వేములపాడులో పారిశుద్ధ్య పనులు చేయిస్తున్న అధికారులు

**సాక్షి ఎఫెక్ట్..**

**హనుమంతునిపాడు:** మండల పరిధి వేములపాడు గ్రామంలో వైద్య సిబ్బంది, వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు పంచాయతీ అధికారులు గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య పనులు చేయించి దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. విషజ్వరాలతో విలవిల అంటూ శుక్రవారం సాక్షిలో ప్రచురించిన కథనానికి ఆరోగ్య, పంచాయతీ సిబ్బంది వేములపాడులో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేయించారు. దోమల నివారణకు ఎబేట్ పిచికారీ చేయించారు. సర్పంచ్ కొండయ్య, కమ్యూనిటీ హెల్త్ అధికారి కేవీ చెన్నయ్య, ఎంఎల్‌హెచ్‌పీ వెంకటలక్ష్మి, పంచాయతీ విస్తరణ అధికారి షేక్ షరీఫ్ పాల్గొన్నారు.

### నేడు ఉపాధి హామీ ప్రజా వేదిక

**వీవీ పల్లి:** మండల పరిధిలోని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి, శనివారం 10 గంటలకు ఉపాధి హామీ కార్యాలయ ఆవరణంలో ఉపాధి హామీ ప్రజా వేదిక నిర్వహిస్తున్నట్లు ఏపీఓ సుబ్బారావు ఎస్ఆర్పీ మూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ప్రజా వేదిక లో 2023 మార్చ్ నుంచి 2024 మార్చ్ దాకా మొత్తం రూ. 12 కోట్ల పని జరిగినట్ల తెలిపారు.

### బైక్‌ను ఢీకొన్న కారు



ప్రమాదానికి గురైన బైక్, కారు

**గుడ్లూరు (కందుకూరు రూరల్):** ఎదురుగా వస్తున్న బైక్‌ను కారు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలోని రాళ్లపాడు గ్రామ మలుపు వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. దారకానిపాడుకు చెందిన డి.బంగారయ్య, వెంకటేశ్వర్లు బైక్‌పై కందుకూరు వస్తున్నారు. కందుకూరు నుంచి దారకానిపాడు వస్తున్న కారు రాళ్లపాడు గ్రామ మలుపు వద్దకు రాగానే బైక్‌ను ఢీకొట్టింది. గాయాలు కావడంతో కావలి వైద్యశాలకు తరలించారు.

### సబ్‌స్టేషన్ నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోండి



సీఎస్‌పురం సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఈఈ వీరయ్య

**సీఎస్‌పురం(పామూరు):** విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వహణపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని విద్యుత్‌శాఖ ఈఈ ఎ.వీరయ్య అన్నారు. సీఎస్‌పురం విద్యుత్ సబ్‌స్టేషన్‌ను శుక్రవారం ఆకస్మికంగా తనఖీ చేశారు. సబ్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. డీఈఈ ఆర్.ఉమాకాంత్, వెలిగండ్ల ఏఈ షేక్.రసూల్ ఉన్నారు.

### పొగాకు సరాసరి ధర కేజీ రూ.222



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న శ్రీనివాసరావు

**టంగుటూరు:** స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో శుక్రవారం జరిగిన వేలంలో పొగాకు సరాసరి ధర కేజీ రూ.222.71 అత్యధిక ధర పలికింది. జమ్ములపాలెం, తుమాడు, కె.ఉప్పలపాడు గ్రామాలకి చెందిన రైతులు 760 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 607 కొనుగోలు జరిగగా, 153 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.358 కాగా కనిష్ట ధర రూ.140 పలకగా సరాసరి రూ. 222.71 ధర పలికింది. వేలంలో మొత్తం 46 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

**1195 పొగాకు బేళ్ల కొనుగోలు**

**కొండపి (సింగరాయకొండ):** కొండపి పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన వేలంలో 1195 బేళ్ల కొనుగోలు చేసినట్లు కొండపి వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. అనకర్లపూడి, పెరిదేపి, మిట్టపాలెం, ముప్పరాజువారిపాలెం, కామేపల్లి, పచ్చవ, అక్కచెరువుపాలెం, గోగినేనివారిపాలెం, పైడిపాడు, చోడవరం, ముప్పవరం, చిన్న వెంకన్నపాలెం, వెన్నూరు గ్రామాలకు చెందిన రైతులు 1531 బేళ్లు వేలానికి తీసుకొచ్చారు. అందులో 1195 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. వ్యాపారులు వివిధ కారణాలతో 336 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ట ధర కేజీ రూ.358, కనిష్ట ధరరూ.120, సరాసరి ధర రూ.197. వేలంలో14 మందివ్యాపారప్రతినిధులు పాల్గొన్నారు.

# టంగుటూరులో టీడీపీ మార్క్ రాజకీయం



ఏడు అడుగులు ముందుకు వచ్చిన టీడీపీ నాయకుడి కాంప్లెక్సు



రోడ్డున పడనున్న చిరువ్యాపారులు

- పెద్దలకు ఒక న్యాయం..పేదలకు మరో న్యాయం
- చిరు వ్యాపారుల పొట్ట కొట్టేందుకు కుటిల యత్నం
- టీడీపీ ముఖ్య నేతలకు అధికారుల దాసోహం
- ప్రపోజల్ దశలోనే ఉన్న రోడ్డు విస్తరణ పనులు
- ఇప్పటి నుంచే ఆక్రమణల తొలగింపు

ఒంగోలు టాస్కుఫోర్సు:

మండల కేంద్రం టంగుటూరులో టీడీపీ మార్క్ రాజకీయానికి అధికార పార్టీ నాయకులు తెరలేపారు. రోడ్డు విస్తరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నియోజకవర్గ ముఖ్య నాయకులు సూచించడంతో ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సిన అధికారులు అదిగో పులి.. ఇదిగో మేక అన్న చందంగా తమ చర్యలు ప్రారంభించారు. ఫలితంగా చిరువ్యాపారుల పొట్టకొట్టే కార్యక్రమం చేపట్టారు. అధికారుల పనితీరు ఎలా ఉందంటే విత్తనాలు కొననూ లేదు.. మొక్క మొలిసిందన్న సామెతలా తయారైంది. ఆక్రమణలు తొలగింపులో కూడా తమదైన శైలిలో స్వామి భక్తి ప్రదర్శిస్తూ విమర్శల పాలవుతున్నారు. తమ ప్రభుత్వంలో పేద, ధనిక తేడా ఉండదని, అందరికీ సమ న్యాయమని ఎన్నికలప్పుడు ఊదరగొట్టిన నాయకులు ఇప్పుడు చిరు వ్యాపారుల పట్ల నిర్దయగా వ్యవహరిస్తున్నారు. టంగుటూరు ప్రధాన కూడలిలో ఉన్న షాపింగు కాంప్లెక్సు ఏడు అడుగులు పంచాయతీ పరిధిలోకి వచ్చినా మార్కింగ్ చేయటంలో అధికారులు స్వామి భక్తి ప్రదర్శించారు. ఇది ఏమి న్యాయమని చిరువ్యాపారులు ప్రశ్నిస్తున్నారు. ఇంత వరకు రోడ్డు విస్తరణకు ప్రపోజల్ మాత్రమే తప్పా ప్రతిపాదనలు సిద్ధం కాలేదు. అప్పుల ప్రభుత్వంలో నిధులు ఎప్పుడు మంజూరవుతాయో అర్థంకాని పరిస్థితి. ఈ పండగ సమయంలో బడుగు బలహీన వర్గాలైన తమపై పక్షపాత ధోరణి ఏంటంటూ చిరు వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు. కూటమికి ఓటు వేయడమే తప్పా అని అధికారుల పనితీరును తీవ్రంగా విమర్శిస్తున్నారు.

**మాజీ ఉప సర్పంచి అత్యుత్సాహం**

టంగుటూరు గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచి పెద్దలకు ఒత్తాసు పలుకుతున్నాడన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డివైడర్‌పై ఎన్నో ఏళ్లగా వ్యాపారం చేసుకుంటున్న చిరువ్యాపారులకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా కేవలం మైకు ద్వారా హెచ్చరించి ఉన్న ఫళంగా ఆక్రమణలు తొలగిస్తున్నారు. ఆక్రమణలు తొలగింపులో ఇటు ఆర్అండ్‌బీ అధికారులు, అటు పంచాయతీ అధికారులు లేకుండా ఒక మాజీ ఉప సర్పంచి దగ్గర ఉండి అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నాడు. టీడీపీ మండల నాయకుడి కాంప్లెక్సు జోలికి వెళ్లకుండా చిరువ్యాపారులపై ఝులుం ప్రదర్శిస్తుండటంపై పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని చట్టరీత్యా ఆక్రమణలు తొలగించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



టంగుటూరులో దగ్గరుండి మరీ తొలగిస్తున్న మాజీ ఉప సర్పంచ్

# భక్తిశ్రద్ధలతో దేవీ పూజలు

**కనిగిరి రూరల్:** దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాల సందర్భంగా పట్టణంతో పాటు, మండలంలోని వివిధ ఆలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. కనక దుర్గమ్మ గుడి, అంకాళమ్మ గుడి, శ్రీ మద్విరాట్ వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయం, దొంతులమ్మ గుడి, సాయిబాబ గుడి, దేవాంగనగర్‌లోని లక్ష్మీ నరసింహ స్వామి ఆలయాల్లో ఆయా కమిటీల ఆధ్వర్యంలో శరన్నవ రాత్రి ఉత్సవాల ప్రత్యేక పూజలు జరిగాయి. పలు ఆలయాల్లో భక్తులు బారులు తీరారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**పామూరు:** స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో శుక్రవారం వాసవీకన్యకా పరమేశ్వరీదేవి అమ్మవారు ధనలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అదేవిధంగా మహాలక్ష్మి అమ్మవారు ధనలక్ష్మీదేవిగా, వల్లీ భుజంగేశ్వర ఆలయంలో వల్లీ అమ్మవారు విశిష్ట అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించారు.

**పీసీపల్లి:** పెద ఇర్లపాడులో వెలసిన శైవక్షేత్రంలో భ్రమరాంబిక అలంకారంతో అమ్మవారు పూజలు అందుకున్నారు. పలు ఆలయాల్లో భక్తులు బారులు తీరారు.

**సీఎస్‌పురం (పామూరు):** ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన భైరవకోనలో శుక్రవారం శ్రీత్రిముఖ దుర్గాదేవి అమ్మవారు రాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అదేవిధంగా సీఎస్‌పురంలో పెద్దమ్మ అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సామూహిక కుంకుమార్చన, హోమం నిర్వహించారు. భైరవకోన ఈఓ డి.వంశీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు వసతులు కల్పించి తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం అందజేశారు. ఎదురూరి గురు చెన్నకేశవాచారి, భక్తులు పాల్గొన్నారు.

**టంగుటూరు:** జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ తల్లి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు అమ్మవారు గాయత్రి దేవిగా భక్తులకి దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు నాగేశ్వరరావు, ఉమాశంకర్ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమ అర్చనలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ్య ఈఓ బి.రమేష్ భక్తులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

**సింగరాయకొండ:** మండలంలోని అన్ని దేవాలయాల్లో శుక్రవారం దసరా శరన్నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. ఆలయాలను విద్యుద్దీపాలతో అలంకరించి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. పాకల శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయంలో పార్వతీ అమ్మవారు రాజరాజేశ్వరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.



భైరవకోనలో రాజరాజేశ్వరీదేవిగా త్రిముఖదుర్గాదేవి అమ్మవారు

**మర్రిపూడి:** శరన్నవరాత్రుల మహోత్సవంలో భాగంగా మండల కేంద్రం మర్రిపూడి శివాలయంలోని అమ్మవారికి శుక్రవారం ఘనంగా పూజలు చేశారు. ఆలయ అర్చకులు నుదురుపాటి అంబయ్య శాస్త్రీ ముందుగా శివపార్వతులకు అభిషేకం చేశారు. అమ్మవారిని నూతన వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారు భక్తులకు గాయత్రీదేవి అవతారంలో దర్శనమిచ్చింది. సహస్రనామ పూజ, అష్టోత్రపూజలు ఘనంగా నిర్వహించారు. మహిళలు భజన, భక్తి కీర్తనలతో అలరించారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని, తమ మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. స్వాముల వారికి బరూరి మాణిక్యం శాస్త్రీ, లీలావతి దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. **పొన్నలూరు:** శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని నాగిరెడ్డిపాలెం పోలేరమ్మతల్లి అమ్మవారు గాయత్రీదేవి అవతారంలో శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు, భక్తులు అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజు ఆలయంలో శ్రీ చక్రార్చన, శతచండీ పారాయణం, శ్రీ సూక్తి పారయణం నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

### ఘన జీవామృతంతో ప్రకృతి వ్యవసాయానికి మేలు

**కొండపి (సింగరాయకొండ):** ఘన జీవన అమృతంతో ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు మేలు కలుగుతుందని యూనిట్ ఇన్‌చార్జ్ రంజిత్ అన్నారు. మండలంలోని పెరిదేపిలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘనజీవన అమృతంతో భూమికి భూసారం పెరిగి అధిక దిగుబడి వస్తుందని, వానపాము శాతం పెరిగి భూమి గుల్లపడే విధంగా చేస్తుందని, భూమికి బలాన్ని చేకూరుస్తుందన్నారు. ఘన జీవామృతం పెరిదేపులోని ఎన్పీఎం షాపులో అందుబాటులో ఉంటుందని, ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. ఐసీఆర్పీ గౌతమి ,రైతులు, పాల్గొన్నారు

### 100 రోజుల పరిపాలనలో అభివృద్ధి శూన్యం



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి గౌతు సత్యేంద్రబాబు

**కొండపి (సింగరాయకొండ):** కూటమి ప్రభుత్వం 100 రోజుల పరిపాలనలో అభివృద్ధి శూన్యంగా ఉందని పీసీసీ ప్రధాన కార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జి గౌతు సత్యేంద్రబాబు ఎద్దేవా చేశారు. స్థానిక పంచాయతీ అతిథి గృహంలో కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి పసుమర్తి సుధాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటిని అసలు పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణలో భాగంగా కాంట్రాక్టు ఉద్యోగులను విధుల నుంచి తొలగించిన అంశంలో అధికార తెలుగుదేశం పార్టీ అసలు స్పందించడం లేదన్నారు. డీసీసీ అధ్యక్షుడు షేక్ సైదా, జిల్లా మహిళా అధ్యక్షురాలు రిహానా భాను, విజేప్రాజ్, అధికార ప్రతినిధి ప్రసన్నరాజు, మండల అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసులు పాల్గొన్నారు.



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దద్దాల నారాయణ యాదవ్, సత్యనారాయణ రెడ్డి

## బూచేపల్లి ప్రమాణ స్వీకారానికి తరలిన శ్రేణులు

**కనిగిరి రూరల్:** వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ నేతృత్వంలో శుక్రవారం పార్టీ శ్రేణులు పార్టీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డి ప్రమాణ స్వీకారోత్సవానికి ఒంగోలుకు తరలి వెళ్లారు. తొలుత పార్టీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్, ఏపీ రెడ్డి కార్పొరేషన్ మాజీ చైర్మన్ చింతల చెరువు సత్యన్నారాయణరెడ్డి స్థానిక చెక్ పోస్టు వద్ద గల వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలతో నివాళులర్పించారు. పీడీసీసీబీ మాజీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, జెడ్పీటీసీలు మడతల కస్తూరిరెడ్డి, మేకల శ్రీనివాసుల యాదవ్, ఎంపీపీలు, వైస్ చైర్మన్లు, వైస్ ఎంపీపీలు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత ఇసుక ఇవ్వకుంటే ఉద్యమం




మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శి మాల్యాద్రి

**పామూరు:** ఎన్నికల హామీల్లో భాగంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఉచిత ఇసుక హామీని వెంటనే అమలు చేయకుంటే సీపీఎం ఆధ్వర్యంలో ఉద్యమం ఉధృతం చేస్తామని ఆ పార్టీ మండల కార్యదర్శి కొమ్మలపాటి మాల్యాద్రి హెచ్చరించారు. స్థానిక సుందరయ్య భవనం సెంటర్‌లో శుక్రవారం సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నాకు దిగారు. ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం కూటమి ఎన్నికల సమయంలో ఉచిత ఇసుక విధానం తెస్తామని చెప్పి అధికారం చేపట్టిన తరువాత హామీని విస్మరించిందని ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ట్రాక్టర్ ఇసుక రూ.3,500 ఉంటే నేడు టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంలో రూ.6 వేలకు పెరిగిందని దీంతో బేల్దారీ కార్మికులు పనులు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పనుల కోసం గ్రామాల నుంచి ఆటోలకు రూ. 50 చెల్లించి మండల కేంద్రానికి వస్తే అక్కడ పనులు లేక ఉసూరుమంటూ వెనక్కు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు టీవీల్లో, పత్రికల్లో ఉచిత ఇసుక ఇస్తున్నామంటూ ప్రకటనలు చేస్తున్నారే తప్ప ఆచరణలో ఇది అమలు కావడంలేదన్నారు. సీహెచ్ వెంకటేశ్వర్లు, కాశీ శంకర్, ఖాసీసాహెబ్, వైవీ నారాయణ, పి.రామయ్య, షేక్ మహబూపీరా, రమణయ్య, నాయబ, బేల్దారి కార్మికులు పాల్గొన్నారు.

## క్రీడల్లో ఉపాధ్యాయినుల ప్రతిభ



రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటిన ఉపాధ్యాయినులు

**కనిగిరి రూరల్:** ఆంధ్ర ప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ స్వర్ణోత్సవ సంబరాల్లో భాగంగా గుంటూరు జరుతున్న రాష్ట్ర ఉపాధ్యాయ, ఉపాధ్యాయినుల ఆటల పోటీల్లో ప్రకాశం జిల్లాకు చెందిన క్రీడా కారులు ప్రతిభ చాటారు. కనిగిరికి చెందిన ఉపాధ్యాయినులు రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. మహిళా విభాగం షార్ట్ పుట్‌లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం, 100 మీటర్ల రన్నింగ్‌లో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో ఎస్‌కే మహిబూన్ నిలిచారు. 45 ఏళ్లకు పై బడిన విభాగంలో 100 మీటర్ల పరుగు పందెంలో రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానంలో వి. కవిత, 400 మీటర్ల విభాగంలో స్పీడ్ వాక్ రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో వి. కల్పన ప్రతిభ చూపారు. అలాగే వివిధ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో నిలిచారు. ప్రతిభ చాటిన ఎస్‌కే మహిబూన్, వి. కల్పన, వి. కవితలను యూటీఎఫ్ కనిగిరి శాఖ అభినందించింది. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా నాయకులు ఎస్‌కే ఖాజా రంతుల్లా, టి. రమణారెడ్డి, పట్నం నరసింహం, బి. మల్లి కార్జున, సీహెచ్ రమేష్, యేసుబాబు, మాల్యాద్రి, సుబ్బారెడ్డి, శేషారెడ్డి తదితరులున్నారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వాల ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న ఐక్యవేదిక కన్వీనర్ ఇర్లా కొండయ్య

**సీఎస్‌పురం(పామూరు):** రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వాలు ప్రజాసంక్షేమం కోసం పనిచేయాలని, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో చైతన్యం తీసుకురావాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ ఇర్లా కొండయ్య పిలుపునిచ్చారు. స్థానిక నారాయణస్వామి కాంప్లెక్స్‌లో శుక్రవారం ప్రజాసంఘాల ఐక్యవేదిక సమావేశం జరిగింది. సమాజంలో అవగాహన లేకపోవడంవల్ల యువత, మహిళలు సామాజిక స్పృహ కోల్పోతున్నారని వారిలో చైతన్యం వచ్చినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. పార్టీలు కాకుండా ఏ ప్రభుత్వం వచ్చినా ప్రజల సంక్షేమం కోసం పనిచేసేలా ఉండాలన్నారు. ప్రజాసంఘాల నాయకులు ఊసా వెంకటేశ్వర్లు, రాజ్యలక్ష్మి, ఎస్.తిరుపతిరెడ్డి, యం.రత్నారెడ్డి, ఏసురత్నం, ఎ.వెంకటేశ్వర్లు, బి.ఏసురత్నం, థామస్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

### కొండపి ఎంపీడీవోగా రామాంజనేయులు



బాధ్యతలు స్వీకరిస్తున్న రామాంజనేయులు

**కొండపి (సింగరాయకొండ):** సాధారణ బదిలీల్లో భాగంగా జె.పంగులూరు నుంచి కొండపి ఎంపీడీవోగా రామాంజనేయులు బదిలీ అయ్యారు. శుక్రవారం ఆయన కొండపి ఎంపీడీవో ఆఫీస్లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాభివృద్ధికి అని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానన్నారు. బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవోకు కార్యాలయ సిబ్బంది పుష్ప గుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. కొండపిలో పనిచేస్తున్న రమణమూర్తి జరుగుమల్లికి బదిలీ అయ్యారు.

### వృత్తిలో అంకితభావంతో పని చేస్తే గుర్తింపు



బ్రహ్మానందరెడ్డిని సన్మానిస్తున్న సచివాలయ, పంచాయతీ సిబ్బంది

**పామూరు:** వృత్తిలో అంకితభావంతో బ్రహ్మానందరెడ్డి పని చేశారని ఈఓ పీఆర్‌డీ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక సచివాలయంలో శుక్రవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో పామూరు మండల ఈఓపీఆర్‌డీగా, మేజర్ పంచాయతీ ఈఓగా పనిచేసి బదిలీపై సీఎస్‌పురం ఈఓగా వెళ్లిన వి.బ్రహ్మానందరెడ్డిని సన్మానించారు. గత 5 సంవత్సరాల కాలంలో పామూరు మేజర్‌గ్రామ పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపారన్నారు. ముఖ్యంగా పంచాయతీ పరిధిలో మౌలిక వసతులకు ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. పంచాయతీ, సచివాలయ సిబ్బంది రత్నకుమార్, మురళి, రజనీకాంత్, బ్రహ్మయ్య, మహేష్, తిరుపాలు, వీరాస్వామి, బండారు బాబు, జిలానీ, నారాయణ, వెంకటేశ్వర్లు, నాయబ్‌రసూల్, కృష్ణవేణి, సిబ్బంది పాల్గొన్నారు.

## ముమ్మరంగా వ్యవసాయ పనులు



శివరాయునిపేటలో పొగాకు పనుల్లో కూలీలు



వల్లాయపాలెంలో వరినాటుతున్న కూలీలు

- ఖరీఫ్‌లో 23,350 ఎకరాల్లో పంటల సాగు

**మర్రిపూడి:** మండలంలో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మండలంలో ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 23,350 ఎకరాల్లో పలు రకాల పంటలు సాగు చేపట్టారు. గ్రామాల్లోనే పనులు దొరుకుతున్నాయని వ్యవసాయ కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో కంది పంట 20 వేల ఎకరాలల్లో సాగు చేయగా సజ్జపంట 750 ఎకరాల్లో, వరి 250 ఎకరాల్లో, పొగాకు 2 వేల ఎకరాల్లో సాగు చేశారు. 700 ఎకరాల్లో శనగ సాగు చేసేందుకు భూమి సిద్ధం చేసి పెట్టారు. పొగాకు మరో వెయ్యి ఎకరాల్లో లేత పొగాకు సాగుకు రైతులు భూమిని సిద్ధం చేసి పెట్టారు. మరో రెండు వర్షాలు కురిస్తే పూర్తి స్థాయిలో పంటలు సాగు చేసుకుటామని మండల రైతులు అంటున్నారు. గ్రామాల్లోనే పనులు దొరుకుతున్నాయని, కూలి సైతం గిట్టుబాటు అవుతుందని వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మర్రిపూడిలో సజ్జ కోస్తున్న కూలీలు